సైబరాబాద్‌లో 10వ విడత మొబైల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం

-సంతోషం వ్యక్తం చేసినబాధితులు

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఈరోజు (10.03.2026)10వ విడత దొంగిలించబడిన మరియు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లను సంబంధిత బాధితులకు స్వయంగా అందజేశారు.

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోయిన మొబైల్ ఫోన్లను గుర్తించి, యజమానులకు అందజేసే క్రమంలో భాగంగా 10వ దశలో 1,016 ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి యొక్క విలువ సుమారు 3,04,80,000 ఈ రికవరీ ప్రక్రియలో సీసీఎస్ శంషాబాద్ పోలీసులు 265, సీసీఎస్ శేరిలింగంపల్లి పరిధిలో 255, సీసీఎస్ కుత్బుల్లాపూర్ పరిధిలో 181, సీసీఎస్

కూకట్‌పల్లి పరిధిలో 160 మరియు సీసీఎస్ రాజేంద్రనగర్ పరిధిలో 155 మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు.

సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ.. ప్రజలు పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తిరిగి స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేస్తున్నామని తెలిపారు. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా ఫోన్లను సులభంగా ట్రాక్ చేస్తున్నామని, ఫోన్ పోగొట్టుకున్న వెంటనే బాధితులు ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మొబైల్ ఫోన్ నేడు ప్రతి ఒక్కరి జీవితంలో ఉపాధికి, వ్యక్తిగత అవసరాలకు కీలక సాధనంగా మారిందని, పోగొట్టుకున్న ఫోన్లను తిరిగి యజమానులకు అప్పగించి వారిలో మళ్లీ ఆనందాన్ని నింపడం పోలీసుల బాధ్యతగా భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

అనంతరం సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ హెచ్చరించారు. ముఖ్యంగా అధిక లాభాల పేరుతో వచ్చే పెట్టుబడి పథకాలు, అనుమానాస్పద లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఇలాంటి నేరాలను అరికట్టేందుకు తెలంగాణ వ్యాప్తంగా "ఆపరేషన్ క్రాక్‌డౌన్" నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ ఆపరేషన్ ద్వారా సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఫ్రీజ్ చేసిన బ్యాంక్ ఖాతాల నుండి బాధితులకు వారి సొమ్ము తిరిగి అందేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిచిన ఐటి టీమ్ మరియు పోలీసు అధికారులను సీపీ ప్రత్యేకంగా అభినందించారు.

ఈ సందర్భంగా క్రైమ్స్ డీసీపీ ముత్యంరెడ్డి మాట్లాడుతూ.. ఫోన్ పోయిన వెంటనే సిమ్ కార్డును బ్లాక్ చేయించడంతో పాటు బ్యాంకు ఖాతాలను తాత్కాలికంగా నిలిపివేయాలని కోరారు. మొబైల్ ఫోన్లకు బలమైన పాస్‌వర్డ్ లు లేదా బయోమెట్రిక్ లాక్‌లు ఏర్పాటు చేసుకోవాలని, ఫోన్లు పోగొట్టుకున్న వ్యక్తులు తమ అనుభవాలను స్నేహితులు, బంధువులకు వివరించి వారిని కూడా అప్రమత్తం చేయాలని పిలుపునిచ్చారు. పోలీసులు అత్యాధునిక సాంకేతికతతో ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నారని, ప్రజలు అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

సైబరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ సాయి మనోహర్ మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నప్పుడు అవి సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కితే యూపీఐ పేమెంట్స్ ద్వారా బ్యాంక్ ఖాతాల నుండి నగదు విత్‌డ్రా చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు ఈ . నేపథ్యంలో బాధితుల అకౌంట్ల

భద్రత కోసం గతంలో ఫ్రీజ్ చేసిన ఖాతాలను పరిశీలించి, సైబర్ నేరాలతో సంబంధం లేని సాధారణ వ్యక్తులు కు సంబంధించి ఈ రోజు 103 బ్యాంక్ ఖాతాలను అన్‌ఫ్రీజ్ చేశామని ఆయన వెల్లడించారు ఫోన్ పోయిన వెంటనే . అప్రమత్తమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని, తద్వారా ఆర్థిక నష్టాలను అరికట్టవచ్చని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

మొబైల్ ఫోన్లు పోగొట్టుకుని తిరిగి పొందిన పలువురు బాధితులు తమ అనుభవాలను పంచుకున్నారు.

అల్వాల్‌లో జరిగిన ఎగ్జిబిషన్‌కు రెండు నెలల క్రితం తన పిల్లలతో వెళ్లిన ఓ మహిళ తన బ్యాగ్‌తో పాటు మొబైల్ ఫోన్ పోయిందని తెలిపారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశానని, ఫోన్‌కు కాల్ చేసినప్పుడల్లా స్విచ్ ఆఫ్ రావడంతో తిరిగి దొరుకుతుందో లేదో అని ఆందోళన చెందానని చెప్పారు. అయితే సైబరాబాద్ పోలీసులు కృషి చేసి తన ఫోన్‌ను తిరిగి అందజేయడంతో వారికి కృతజ్ఞతలు తెలిపారు.మరో బాధితుడు తన మొబైల్ ఫోన్ పోయి చాలా కాలం అయిపోయిందని, ఇక అది దొరకదని భావించానని తెలిపారు. అయితే పోలీసులు అకస్మాత్తుగా ఫోన్ చేసి తన ఫోన్ దొరికిందని చెప్పడంతో ఎంతో ఆనందంగా అనిపించిందని చెప్పారు.

కరీంనగర్‌కు చెందిన మరో వ్యక్తి తన కూతురిని చూడటానికి నార్సింగ్ ప్రాంతానికి వచ్చినప్పుడు రోడ్డుపై నడుస్తుండగా జేబులో నుంచి మొబైల్ ఫోన్ పడిపోయిందని తెలిపారు. ఆ ఫోన్‌లో తన బ్యాంక్ ఖాతా వివరాలు మరియు ఇతర ముఖ్యమైన సమాచారం ఉండటంతో ఎవరైనా దుర్వినియోగం చేస్తారేమోనని భయపడ్డామని చెప్పారు. అయితే సైబరాబాద్ పోలీసులు కృషి చేసి తన ఫోన్‌ను తిరిగి అందజేయడంతో సంతోషం వ్యక్తం చేశారు.

విశాఖపట్నానికి చెందిన వ్యక్తి లోన్ యాప్ మోసానికి గురయ్యానని తెలిపారు. చిన్న మొత్తంలో లోన్ తీసుకున్న తర్వాత తన వద్ద నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేశారని చెప్పారు. డబ్బులు చెల్లించకపోతే తన ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెట్టేస్తామని బెదిరించారని తెలిపారు. తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సమస్య నుంచి బయటపడగలిగానని, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమం లో క్రైమ్స్ డీసీపీ ఎ. ముత్యం రెడ్డి, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, క్రైమ్స్ ఏసీపీ వై. నాగేశ్వర్ రావు, ఇన్స్పెక్టర్లు బి. భూపాల్ గౌడ్, ఇన్స్పెక్టర్, సీసీఎస్ కుకట్పల్లి, కె. రవి కుమార్, ఇన్స్పెక్టర్, సీసీఎస్ షంషాబాద్, పి. దాలి నాయుడు, ఇన్స్పెక్టర్, సీసీఎస్ కుత్బుల్లాపూర్, ఎ. రవి కుమార్, ఇన్స్పెక్టర్, సీసీఎస్ కుకట్పల్లి, పి. రాజేష్, ఇన్స్పెక్టర్, సీసీఎస్ రాజేంద్రనగర్, ఐటి ఇన్స్పెక్టర్ నరసింహ తధితరలు పాల్గొన్నారు.

ఎ.ముత్యంరెడ్డి,

క్రైమ్స్ డీసీపీ,సైబరాబాద్.